

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఆటవిడుపు

**"బాబాయ్ పొలం అమ్ముదామని** గొడవ చేస్తున్నాడట. నాన్న ఫోన్ చేసి అర్జెంట్‌గా రమ్మన్నాడు. రాత్రి బస్‌కి వెళ్తున్నాను." ఆఫీస్‌నుంచి వచ్చిన దివాకర్ చెప్పాడు.

"మరి వైజాగ్?" కాంచన నీరుకారిపోతూ అడిగింది.

"నేను రాకపోతే ఏం? నువ్వెళ్ళొచ్చుగా?" చిరాగ్గా అడిగాడు.

"నేను? ఒంటరిగా?"

"ఒంటరిగా ఏంటీ? ఇంకా ముప్పైమంది వస్తున్నారు కదా? నిన్ను స్టేషన్‌లో వాళ్ళకి అప్పగించి నేను బస్టాండ్‌కి వెళ్ళి దొరికిన బస్ ఎక్కి వెళ్ళిపోతా" చెప్పి బాత్‌రూంలోకి వెళ్ళాడు.

'అప్పగించడం' అనేమాట నచ్చని కాంచన ఆ మాట బయటకి అనే ధైర్యంలేక సర్దిన సూట్‌కేస్ తెరిచి, అందులోని భర్త బట్టలు, షేవింగ్ కిట్ తీసి మరో చిన్న పెట్టెలో సర్దింది. తన సూట్‌కేస్‌ని మరోసారి అన్నీ వున్నాయా లేదా అని చెక్ చేసింది.

"తినడానికి ఏమైనా వున్నాయా?" దివాకర్ అడిగాడు.

"లేవు. నాలుగు రోజులు ఉండమని ఫ్రిజ్ ఖాళీ చేసాను. 'అందరికీ మీల్స్ పేకెట్స్ రెడీ చేస్తున్నాం ఎవరూ ఏమీ తేవద్దు' అని విజయ చెప్పింది అందుకని ఏమీ చేయలేదు" బెదురుగా చెప్పింది.

"సరే. రైలు టైం అవుతోంది పద."

అతను తిట్టనందుకు సంతోషిస్తూ సూట్‌కేసులు పట్టుకెళ్తున్న భర్త వెనక హేండ్‌బేగ్‌తో నడిచింది.

"సారీ విజయగారు. అర్జెంట్‌గా మా ఊరు వెళ్ళాల్సివస్తోంది. టికెట్ కేన్సిల్ చేసే టైం కూడా లేదు" దివాకర్ చెప్పాడు.

"అయ్యో! పర్లేదండి. కాంచనని పంపిస్తున్నందుకు థాంక్స్." విజయ చెప్పింది.

తన డిగ్రీ ఫ్రెండ్స్ దాదాపు పదిహేనుమందిని ఒకేచోటచూసిన కాంచనకి పట్టరాని సంతోషం కలిగింది. అందర్నీ చిరునవ్వుతో చూసింది.

"ఇంక నేను వెళ్తాను. జాగ్రత్త. డబ్బులున్నాయా?" భార్యని అడిగాడు దివాకర్.

ఉన్నాయన్నట్లుగా తల వూపి చెప్పింది.

"మీ ఊళ్ళో ఫోన్ సిగ్నల్స్ వుండవు. మెసేజ్ చేస్తూండండి. నేను కూడా ఫోన్ ట్రై చేస్తా. లేదంటే మెసేజ్ చేస్తా."

"దివాకర్‌గారూ మీ మీల్స్ పేకెట్ తీసుకోండి. ఇప్పుడు బయట ఏం తింటారు" విజయ అభిమానంగా చెప్పి అతనికో పెద్ద పేకెట్, ఒక పెట్ వాటర్ బాటిల్ ఇచ్చింది.

దివాకర్ వెళ్ళిన దాదాపు పదినిమిషాలదాకా కాంచన స్థబ్ధంగా వుండిపోయింది. రైలు నిశ్శబ్ధంగా కదిలి వేగం పుంజుకున్నాక ఓసారి చుట్టూ చూసింది. దాదాపు సగం కంపార్ట్‌మెంట్ విజయ కొడుకు పెళ్ళి బృందమే. బంధువులకంటే స్నేహితులే ఎక్కువగా వున్నారు. విజయ ఫ్రెండ్స్, ఆమె భర్త స్నేహితులు, పెళ్ళికొడుకు స్నేహితులు. అంతా సమూహాలుగా ఏర్పడి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"కాంచనా! ఎన్నిరోజులైందే నిన్ను చూసి" ఒకామె వచ్చి పక్కన కూర్చుంటూ అడిగింది.

"రాధా" కాంచనకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మన బృందం అటువైపు కూర్చున్నారు రా." ఆమె వెనక తన మిత్రులని కలుసుకున్న కాంచనకి కబుర్లతో కాలం తెలియలేదు. భోజనాల సమయంలో దివాకర్‌కి ఫోన్ చేసింది.

'వెంటనే బస్ దొరికిందని హయత్ నగర్ దాటానని చెప్పాడు.'

కొంతమంది భర్తలతో, కొంతమంది భార్యలతో వచ్చారు. తనలా వంటరిగా మరో ఇద్దరు వచ్చారు. 'విజయ అభిమానంగా అందరి అడ్రస్‌లు కనుక్కుని పిలిచింది' అనుకుంది.

పదిగంటలకి కంపార్టుమెంట్‌లో సందడి సన్నగిల్లింది. తన బెర్త్ మీద పడుకున్న కాంచనకి ఓ పట్టాన నిద్రపట్టలేదు. తను వంటరిగా ప్రయాణిస్తోంది. దివాకర్ ఆంక్షలు, నీతులు, హితబోధలు విమర్శలు లేకుండా స్వేచ్ఛగా గడపబోతోంది. ఆమెకి మామగారి మీద, పినమామగారి మీద అవ్యాజ్యమైన అభిమానం కలిగింది.

అనకాపల్లి రాగానే విజయ అందర్నీ నిద్రలేపింది.

"మొహాలు కడుక్కుని కాఫీలు తాగండి." 'రైలు కాఫీ, వేణ్ణీళ్ళల్లో పంచదార వేసినట్లుంటుంది. తాగడం వేస్ట్.' లాంటి దివాకర్ నీతులులేని కాంచన హాయిగా రైలు కాఫీ తాగేసింది. తర్వాత జుట్టు పైపైన సర్దుకుని బొట్టు సరిచేసుకుంది.

పెళ్ళికూతురు తరపువారు స్టేషన్‌కి ఓ బస్సుని తీసుకొచ్చారు. అందరూ ఎక్కాక బస్సు కదిలి ఓ గెస్ట్‌హౌస్ ముందు ఆగింది.

విజయవాళ్ళు ముందే వాళ్ళతో వచ్చే అతిధుల జాబితా ఇవ్వడంతో అందులోని ఇరవైగదులని పేరుపేరునా కేటాయించి తాళం చెవులు ఇచ్చారు. రెండో అంతస్థులోని ఓ గది దివాకర్ దంపతులకి కేటాయించారు.

"విజయా. ఆయన రాలేదుగా పోనీ ఇంకెవరినైనా పంపుతావా రూం షేరింగ్‌కి?" మొహమాటంగా అడిగింది.

"ఎవరూ అక్కర్లేదు. నీకు భయమైతే చెప్పు. నేను తోడుంటా." చెప్పింది విజయ.

"భయమా?" నవ్వింది కాంచన.

"హాయిగా ఒక్కదానివే వుండు" విజయ ఆమె భుజం మీద అనునయంగా తట్టింది.

రూమ్ చిన్నగా వున్నా వివరంగా వుంది. డబుల్ బెడ్, అటాచ్డ్ బాత్‌రూం, టి.వి, ఏర్ కండిషనర్, చిన్న రైటింగ్ టేబుల్, కుర్చీ సూట్ కేస్‌ని టేబుల్ మీద పెట్టి బట్టలు తీసుకుని స్నానం చేసి వచ్చింది. తయారై కిందకి వచ్చేసరికి డైనింగ్ హాల్‌లో బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేస్తున్నారు.

"కాంచనా. ఒకమాట" రాధ పిలిచింది.

"ఏమిటి?" అన్నట్లుగా చూసింది కాంచన.

"టిఫిన్ తిన్నాక సింహాచలం వెళ్దాం వస్తావా? ఎటూ స్నాతకం అయి భోజనాలు పెట్టేసరికి మధ్యాహ్నం అవుతుది. అప్పటికి వచ్చేస్తాం."

"ఏమండీ, సింహాచలంట వెళ్ళనా?" అని అడిగే అవసరం లేకుండా కాంచన కొండపల్లి బొమ్మలా తలూపుతూ చెప్పింది.

"తప్పకుండా వస్తాను. విజయ ఏమీ అనుకోదుగా?"

"ఏమీ అనుకోదు. పెళ్ళి వాళ్ళిచ్చిన కారులో వెళ్ళిరమ్మని చెప్పింది."

"ఐతే నో ప్రాబ్లం. పద టిఫిన్ తిందాం" కాంచన ఉత్సాహంగా చెప్పింది.

వెంటనే దివాకర్ గుర్తొచ్చాడు. తక్షణం సెల్‌ఫోన్ తీసి రీచ్‌డ్ సేఫ్ అని మెసేజ్ ఇచ్చి ఊపిరి పీల్చుకుంది. టచ్‌లో లేకపోతే అతనికి కోపం వస్తుంది.

గుడిమెట్ల మీది బిచ్చగాళ్ళకి ధైర్యంగా దానం చేసింది. 'మనం డబ్బులిచ్చి అడుక్కునే వాళ్ళని సృష్టిస్తున్నాం' అని దివాకర్ దానం చెయ్యనివ్వడు. కాంచనకి గుళ్ళో హుండీలో వేయడం కంటే ఆ డబ్బు బిచ్చగాళ్ళకి ఇస్తే తృప్తిగా వుంటుంది.

ఆమెకి ఈ వంటరి ప్రయాణం పట్టలేనంత ఆనందంగా వుంది. దేవుడి దర్శనమై పెళ్ళిమంటపానికి వచ్చేసరికి స్నాతకం చివరిలో వుంది. భోజనాలు అయ్యాక రాధ మళ్ళీ కాంచనని పిలిచి అడిగింది.

"పెళ్ళి రేపు రాత్రికి కదా. ఇవాళ రాత్రి సంగీత్ ప్రోగ్రాం ఏర్పాటు చేసారుట పెళ్ళికూతురు వాళ్ళు. డ్రస్ కోడ్ తెలుపు. నీదగ్గర తెల్ల చీరలు ఉన్నాయా?"

"లేవు. ప్రయాణాల్లో తెల్లవి తీసుకురాను. ఇప్పుడెలా?"

"మనం షాపుకి వెళ్ళి వైట్ చుడీదార్ కొనుక్కుందామా? డాన్స్‌కి బావుంటుంది. రెడీమేడ్ కాబట్టి చీరలా ఫాల్, బ్లౌజ్ గొడవ ఉండదు" రాధ ఉత్సాహంగా చెప్పింది.

"ఓ! వెళ్దాం." కాంచన కూడా ఉత్సాహపడింది.

"కాంచనా! దివాకర్‌గారు నీకు మనీ ఇచ్చారా? లేదంటే చెప్పు. నేనిస్తాను" విజయ అభిమానంగా చెప్పింది.

"నాదగ్గర చాలా డబ్బుంది విజయా. అక్కర్లేదు. చాలా థాంక్స్" చెప్పింది కాంచన.

వీరికి మరో ఇద్దరు జతగూడారు. అంతా దగ్గర్లో ఉన్న షాపింగ్‌మాల్‌కి వెళ్ళి తెలుపు మీద ప్రింట్స్ ఉన్న రెడీమేడ్ కుర్తాలు, చుడీదార్లు, అండర్‌వేర్లు కొనుక్కున్నారు. కాంచన ఉత్సాహంగా నచ్చిన మరో రెండు జతలు బట్టలు కొనుక్కుంది.

ఆ సాయంత్రం ఏడుగంటలకి సంగీత్ మొదలైంది. కాంచన చాలా ఉత్సాహంగా స్టెప్స్ వేసింది. దివాకర్‌కి ఇలాంటికి ఇష్టం వుండవు. ఆమె అన్నయ్య కొడుకు నార్త్ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నప్పుడు వాళ్ళు ఇలా సంగీత్ అరేంజ్ చేస్తే, ధుమధుమలాడుతూ కూర్చుని విమర్శించాడు. 'అంత ముసలివాళ్ళు ఆ ఎగురుళ్ళు ఏమిటి? సిగ్గూ, శరం లేకుండా' అని అతని కోపం తెలిసి కాంచన వాళ్ళు ఎంత బలవంతం చేసినా స్టేజ్ ఎక్కలేదు. ఇక్కడ ఆ కనపడని కంచెలేదు కాబట్టి స్వేచ్ఛగా అలసట వచ్చేదాకా డాన్స్ చేసింది.

ఆ రాత్రి స్నానం చేసి బెడ్ మీద పడుకున్న కాంచనకి, ఆ ఉదయం నుంచి జరిగిన సంగతులు ఆలోచించుకుంటే, ఒకరి నిర్ణయం మీద ఆధారపడకుండా, ఒకరి అనుమతి తీసుకోకుండా స్వంత ఆలోచనలతో అనుకున్నది చేయడంలో ఎంత ఆనందం వుందనిపించింది.

మర్నాడంతా పెళ్ళి హడావిడి. 'ఇడ్లీలు గట్టిగా వున్నాయి. ఉప్మా తినకు ఉప్పు కసం, దోసె కరకరమనట్లా, చట్నీలో చింతపండు ఎక్కువైంది' లాంటి దినకర్ కంప్లయింట్స్ లేకుండా నచ్చింది తిని కాఫీ తాగి 'ఇదేకదా స్వర్గం' అనుకుంది. ఉత్సాహంగా ఆ ఒక్కరోజే నాలుగు చీరలు మార్చింది.

పెళ్ళయ్యాక రూమ్‌కి వచ్చి పడుకుని 'ఇదే చివరిరాత్రి' అనుకోగానే దిగులు కమ్ముకొచ్చింది. టి.వి పెట్టి పాత హిందీ సినిమా వస్తుంటే చూడసాగింది. ఆమెతో తనకేం పనిలేకపోయినా, ఆమెకి అప్పుడు చేయాల్సిన పనిలేకపోయినా కూడా దివాకర్ రాత్రి పది తర్వాత కాంచన టి.వి చూస్తే ఊరుకోడు. దాన్ని ఆపేదాకా నస పెడుతూనే వుంటాడు. ఆ నసలేకపోవడంతో పూర్తి సినిమా చూసి తృప్తిగా నిద్రపోయింది.

రైలు సాయంత్రానికి కానీ లేకపోవడంతో పగలంతా ఖాళీ. రాధతో సహా అంతా అన్నవరం వెళ్ళొస్తామని బయలుదేరారు.

"విజయా! నేను భీమ్లీ వెళ్ళొస్తాను. మరోచరిత్ర సినిమా చూసినప్పటినుంచి వెళ్ళాలని చాలాకోరిక." కాంచన చెప్పింది.

"ఒక్కదానివేనా?" విజయ తటపటాయించింది. తర్వాత చెప్పింది.

"ఒక్క నిమిషం."

పావుగంట తర్వాత కాంచన ఎక్కిన కారు భీమ్లీ దారిపట్టింది. చిరు ఎండగా ఉన్న ఆ పరిసరాలన్నీ తిరిగిచూసింది. SOS చిల్డ్రన్స్ విలేజ్, సౌరిస్ ఆశ్రమం బీచ్... వంటరిగా ఆ మధ్యాహ్నం అలా బీచ్‌లో తిరుగుతుంటే ఆమెకి పట్టరానంత దుఃఖం వచ్చింది.

మూడుగంటలకల్లా వెనక్కి వచ్చి విజయతో చెప్పింది.

"థాంక్స్ విజయా. నా కోరిక నెరవేర్చావు."

"దివాకర్‌గారు నీలోని భావుకత్వాన్ని ఎలా చిదిమేసారో తెలిసిన ప్రత్యక్షసాక్షిని నేను. నలభైఐదేళ్ళ వయసులో కూడా నువ్వు వంటరి తనాన్నే ఇష్టపడుతున్నావంటే, నీకు ఆయనతో ఎలాంటి స్నేహం పెరగలేదని అర్ధం. ఈ మూడురోజుల ఆటవిడుపు నీకు నచ్చినందుకు నాకు హేపీగా ఉంది." విజయ ఆప్యాయంగా చెప్పింది.

"నిజం విజయా! నేను హేపీగా వున్న ఏ సందర్భంలోనూ ఆయన గుర్తు రాలేదు. ఓ మనిషి మనతో లేరు అంటే అయ్యో అనుకోవాలి కానీ అమ్మయ్య అనుకోకూడదు. ఆ విషయంలో దివాకర్ అంటే నాకు చాలా జాలి" కాంచన కంఠం వణికింది.

తనని తీసుకెళ్ళడానికి స్టేషన్‌కి వచ్చిన దివాకర్‌తో నెమ్మదిగా చెప్పింది కాంచన.

"మిమ్మల్ని చాలా మిస్సయ్యానండి."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story